క్లుప్తంగా

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కంకిపాడు: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ ఎస్.జాకబ్‌రాజు అన్నారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం మాదక ద్రవ్యాలు-ఆరోగ్యంపై ప్రభావం అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జాకబ్ రాజు మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో క్రమశిక్షణ కోల్పోతారన్నారు. పోటీల్లో షేక్ ఆరిఫున్నీసా, పఠాన్ నసీమ, ఎం.హేమాశ్రీ విజేతలుగా నిలిచి బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం టి.సంధ్యారాణి, ఉపాధ్యాయులు జ్యోతిరాణి, పార్వతి, శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

యనమలకుదురులో విధుశేఖర స్వామి పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో సోమవారం అష్టబంధ మహాకుంభాభిషేకం వైభవంగా చేశారు. దక్షిణామ్నాయ శ్రీశారదా పీఠాధీశ్వర అనంత శ్రీవిభూషిత జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాసన్నిధానం వారి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ సన్నిధానం అమృత హస్తాలతో స్వామివారికి మహాకుంభాభిషేకం ఘనంగా చేశారు. స్వామివారు ఆలయంలో శ్రీరామలింగేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణ దాత సంగా నరసింహారావు దంపతులు, భక్తులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో 3వ సోమవారం సందర్భంగా శాంతికల్యాణం చేశారు. శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో నేడు అన్నసంతర్పణ కార్యక్రమంలో నిర్వహిస్తామని ఆలయ ఈఓ ఎన్.భవాని తెలిపారు.

రబీలో పంట మార్పిడికి చర్యలు

పెనమలూరు: రబీ పంటలో రైతులు పంట మార్పిడి చేసి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. ఆమె సోమవారం చోడవరం, పెనమలూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. రబీలో వరి పంట మాత్రమే కాకుండా రైతులు మినుము, మొక్కజొన్న పంటల సాగుపై కూడా దృష్టి పెట్టాలన్నారు. వరి పంట కోతకు వచ్చినందున రైతులు సరైన నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆమె క్యాబేజీ, అల్లం, మొక్కజొన్న తదితర పంటలను పరిశీలించారు. కాగా రైతులు సబ్సిడీపై టార్పాలిన్లు, స్ప్రేయర్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏలు వంశీ, అనూష, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సాయి మందిర వార్షిక వేడుకలు



కంకిపాడు: ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్‌లో వేం చేసి ఉన్న ధ్యాన యోగ సాయి మందిరం తృతీయ వార్షికోత్సవాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. బాబాకు పంచామృతాభిషేకం, గణపతి పూజ, లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ హోమం, వాస్తు హోమం, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, ప్రత్యేక పూజలు దంపత సమేతంగా పాల్గొని భక్తిశ్రద్ధలతో జరిపించారు. వ్రతం ఆచరించిన భక్తులకు రజత సత్యనారాయణస్వామి వారి రూపులను అందజేశారు. కోటంరాజు సాయికృష్ణ ప్రసాద్‌చే సాయిలీలా వైభవం ప్రవచనం ప్రతి ఒక్కరినీ అలరించింది. భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. పూజా కార్యక్రమాలు, వార్షిక వేడుకలను గాయత్రీ విహార్ అసోసియేషన్ అధ్యక్షురాలు టి.పుష్పవతి పర్యవేక్షించారు.

రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

గన్నవరం: సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా రాష్ట్రంలో విద్య, ఉద్యోగాలు పరంగా ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళీ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ వెంకటశివయ్యకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదం తెలిపాలని కోరారు. పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లుకు మద్దతుగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేసి పంపించాలని డిమాండ్ చేశారు. సంఘ నేతలు వై.రోజా, పి.చంద్రిక, కె.నాగమణి, ఆర్.కుమారి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చీమలవాగు ఆక్రమణలతో ఇక్కట్లు



బీబీ గూడెం వద్ద స్వరూపం కోల్పోయిన చీమలవాగు



కొత్తగూడెం వద్ద అభివృద్ధికి నోచుకోని చీమలవాగు కాజ్‌వే

- ఇటీవల వరదలకు ముందుకు కదలని నీటితో మునిగిన పంట భూములు
- కట్టలు నిర్మించి, వాగు లోతు చేయాలని రైతుల వినతి

గన్నవరంరూరల్: మండలంలోని చీమలవాగు ఆక్రమణలకు గురైంది. దీంతో రైతులు ఇక్కట్లు పడుతున్నారు. చిక్కవరం బ్రహ్మయ్యలింగం చెరువు కళింగ నీరు పొంగి ఆ ఉధృతి సమీపంలోని చీమలవాగులోకి చేరుతుంది. అక్కడి నుంచి ప్రవాహం కొనసాగి కొత్తగూడెం పోలవరం కాలువ దిగువన నిర్మించిన అండర్ పాస్ ద్వారా కొత్తగూడెం, చిక్కవరం గ్రామాల మధ్య ఉన్న కాజ్‌వే గుండా ప్రవహిస్తూ బీబీగూడెం, పురుషోత్తపట్నం, సావరగూడెం దాటి గూడవల్లి వద్ద బుడమేరులోకి చేరుతుంది.

వాగు మార్గంలో ఆక్రమణలు

కొత్తగూడెం మొదలుకుని చీమలవాగు ప్రవహించే మార్గంలో పలు చోట్ల ఆక్రమణలకు గురి అయ్యిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా ఇటీవల వరదలు వచ్చిన సందర్భంలో వాగు సమీపంలోని ఇరువైపులా పంట భూములన్నీ మునిగిపోయాయని రైతాంగం పేర్కొంటున్నారు. వాగులో పిచ్చి కంప, గడ్డి మొలిచి నీరు ముందుకు వెళ్లేందుకు వీలు లేకుండా ఉంది.

గతంలో వాగు అభివృద్ధికి చర్యలు

దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనా కాలంలో చీమలవాగును అభివృద్ధి చేశారు. బీబీ గూడెం వద్ద ప్రయాణాలకు ఇబ్బందులు లేకుండా చీమలవాగుపై వంతెన సైతం నిర్మించారు.

గన్నవరం మెట్ట ప్రాంత గ్రామాల్లో పంట భూములకు ఆధారంగా నిలిచిన చీమలవాగు స్వరూపాన్ని కోల్పోయింది. ఇరువైపులా కట్టలు నిర్మించి వాగును లోతు చేయాలని రైతాంగం కోరుతున్నారు. వర్షాలు అధికంగా కురిసినప్పుడు, వరదలు వచ్చినా సమీపంలోని ఇరువైపులా పంట భూములకు ఆయా గ్రామాల్లో ఇబ్బందులు ఉండవని చెబుతున్నారు.

వాగును బాగు చేయండి

ఇటీవల కురిసిన వర్షాలకు బీబీగూడెం చీమలవాగు పరివాహక పంట భూములు మునిగిపోయాయి. చీమలవాగు నీరు ముందుకు కదలకపోవటంతో రైతులు నష్టపోయారు. వెంటనే అధికారులు స్పందించి వాగును బాగుచేయించాలని రైతులు కోరుతున్నారు.

చోడవరంలో ఆగని ఇసుక మాఫియా

పెనమలూరు: కూటమి పాలనలో ఇసుక మాఫియా చెలరేగి పోతుంది. చోడవరం క్వారీలో ఇసుక అక్రమ తవ్వకాలను మళ్లీ ప్రారంభించారు. వందల కొద్ది ట్రాక్టర్లతో పర్యావరణం దెబ్బతినే విధంగా ఇసుక తవ్వకాలు చేసి తరలిస్తూ కాసులు పోగేసుకుంటున్నారు. కోర్టు ఆదేశాలు అమలు చేయాల్సిన అధికారులు నేతల కంటే మించి పోయి దాగుడుమూతలాడుతున్నారు. చోడవరం క్వారీ ఇసుక మాఫియాకు అడ్డాగా మారింది. అత్యున్నత న్యాయం స్థానం ఆదేశాలు సైతం బేఖాతర్ చేసి ఇసుక తవ్వకాలు చేసి బ్లాక్‌మార్కెట్‌లో అమ్ముకుంటున్నారు. బడా నేత అండదండలతో దందా మూడు పువ్వులుగా ఆరు కాయలుగా సాగుతుంది. అధికారులు అండదండలు పుష్కలంగా ఉన్నాయని ఆరోపణలు వస్తున్నాయి. రోజుకు 200 ట్రాక్టర్లు పగలు రాత్రి అనే తేడా లేకుండా వందలాది ట్రిప్పులు ఓవర్‌లోడ్‌తో మితిమీరిన వేగంతో వస్తూ గ్రామాల్లో అలజడి రేపుతున్నాయి. రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న చోడవరం ఇసుక క్వారీ దందా మాత్రం ప్రభుత్వానికి కనబడటం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. కేవలం జీతాలు తీసుకోని పబ్బం గడుపుతున్న అధికారులు ఇకనైనా మేల్కోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక

ర్యాంపుల కోసం కీచులాట..

కాగా చోడవరం ఇసుక క్వారీకి మూడు ర్యాంపులు చట్ట విరుద్ధంగా ఏర్పాటు చేశారు. క్వారీలో నుంచి ట్రాక్టర్ బయటకు రావాలంటే దారి నిర్వాహకులకు ట్రిప్పునకు రూ.200 చొప్పున కప్పం చెల్లించాలి. ఇతర ప్రాంతానికి చెందిన వ్యక్తి వేసిన దారికి అతనికి రోజుకు రూ.70 వేలకు పైగా ఆదాయం రావటంతో స్థానిక టీడీపీ నేతలు అడ్డం తిరిగారు. ఇటీవల బడా నేత వద్ద పంచాయతీ పెట్టారు. దీంతో స్థానిక టీడీపీ నేతలే ర్యాంపు ఆదాయం తీసుకోవాలని నిర్ణయించి మరో ర్యాంపు వేశారు. ట్రాక్టర్ల రాకపోకలకు స్థానిక టీడీపీ నేతలు కప్పం వసూలు చేస్తున్నారు.

జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ

గన్నవరం: జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో స్థానిక సెయింట్‌జాన్స్ మాధ్యమిక పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విజయవాడలో డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్స్ అకాడమీ, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ ఇంజినీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 13న పోటీలను నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తమ పాఠశాల విద్యార్థులు డి.తనిష్క సీనియర్ విభాగంలో ద్వితీయ స్థానం, టి.వేదశ్రీకావ్య జూనియర్ విభాగంలో తృతీయ స్థానం, కె. రిషిప్రియా సబ్ జూనియర్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. అనంతరం బహుమతులు సాధించిన విద్యార్థులను, వీరికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు డి.శ్రీనివాసరావును ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం అభినందించింది. సీనియర్ బ్రదర్ జిమ్మీకురియాకోస్, బ్రదర్ భల్లాజోసఫ్, బ్రదర్ జయబాలన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్

ప్రజల పక్షాన పోరాటం చేయాలి

పెనమలూరు: ప్రజల పక్షాన పోరాటం చేసి అండగా నిలవాలని కృష్ణా జిల్లా సీపీఎం కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. యనమలకుదురు వీఎల్ భవన్‌లో సోమవారం మండల సీపీఎం 6వ మహాసభను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. నేడు రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతుందన్నారు. నిత్యవసర సరుకుల ధరలు పెంచటమే కాకుండా, విద్యుత్ చార్జీలు కూడా పెంచారన్నారు. కానూరు ప్రధాన రహదారి, యనమలకుదురు వంతెన నిర్మాణం పూర్తి చేయాలని, జగనన్న కాలనీలలో రోడ్లు నిర్మించాలని, పోరంకిలో జిల్లా పరిషత్ స్కూల్ వద్ద వర్షానికి రోడ్డు మునుగుతున్నందున డ్రెయినేజీలు నిర్మించాలని చేసిన తీర్మానాలను సభ్యులు ఆమోదించారు. సమావేశంలో తొలుత సీతారామ్ ఏచూరి, కామ్రేడ్ ఎస్‌కె.గాలీబీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప్పాడ త్రిమూర్తి, షేక్.కాశిం, షేక్.మస్తాన్‌వలి, పుసునూరు లక్ష్మీనారాయణ, మాదు నాగేశ్వరరావు, పాతాలలక్ష్మి, వీసం సోమశేఖర్, ఎస్‌కె.బాబు, ఎస్‌కె.ఒలిమ్మా, పలువురు పాల్గొన్నారు.



యనమలకుదురులో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం మండల కార్యదర్శిగా కాశిం

సీపీఎం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు సోమవారం యనమలకుదురు వీఎల్‌భవన్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, పార్టీ నాయకులతో జరిగిన పార్టీ సమావేశంలో పెనమలూరు మండల సీపీఎం నూతన కమిటీని నియమించారు. పెనమలూరు మండల సీపీఎం కార్యదర్శిగా ఎస్‌కె.కాశింను ఎన్నుకున్నారు. ఆయనతో పాటు మరో 11 మంది సభ్యులు కూడా ఎన్నుకున్నారు. మండలంలో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని కాశిం తెలిపారు.

ఎస్సీ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని వినతి

గన్నవరం: స్థానిక ఎస్సీ కాలనీలో అధ్వానంగా ఉన్న రహదారులు, డ్రెయిన్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ టి.స్వర్ణలతకు కాలనీవాసులు వినతిపత్రం సమర్పించారు. మాదిగలు, మాలలు, యానదులు నివాసించే తమ ప్రాంతం దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. స్థానిక చింతలపేట, రాయనగర్ నుంచి వచ్చే మురుగు తమ ప్రాంతం మీదుగా ప్రవహించి శింగనగుంట చెరువులో కలుస్తున్నాయని చెప్పారు. దీనివల్ల చెరువులోని నీరు కలుషితమై తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమల వ్యాప్తి చెందున్నాయని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు తమ ప్రాంతంలో క్షేత్రస్థాయిలో పర్యటించి సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. క్రైస్తవ శ్మశానవాటికలో సమస్యలను కూడా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కాలనీవాసులు రాచేటి మురళీ, సగ్గుర్తి శివ, జె.విజయరాజు, ఏసుపాదం, సీహెచ్ మల్లేశ్వరి, నక్షత్రం, పి.ప్రసాద్, 50 మంది స్థానికులు పాల్గొన్నారు.

ఎన్‌పీసీఐ సర్వేతో అర్హులకు పథకాలు

ఉయ్యూరు: ఎన్‌పీసీఐ సర్వేతో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు సమర్థంగా అందుతాయని ఎంపీపీ చీలి కల్పన అన్నారు. మండలంలోని గండిగుంట, కలవపాముల, కాటూరు గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న ఎన్‌పీసీఐ(నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) సర్వే సోమవారం నిర్వహించారు. ఈ సర్వేను ఎంపీపీ చీలి కల్పన, ఎంపీడీఓ శేషగిరిరావు పర్యవేక్షించారు. కల్పన మాట్లాడుతూ ఆధార్‌తో బ్యాంకు అనుసంధానం లేకపోవటంతో, బ్యాంకు ఖాతాలు పునరుద్ధరణ కాక సంక్షేమ పథకాలు అర్హులకు దక్కకుండా పోతున్నాయన్నారు. ఈ సర్వేతో ఆధార్, బ్యాంకు ఖాతా అనుసంధాన ప్రక్రియ సాగుతుందన్నారు. ఎంపీడీఓ శేషగిరిరావు మాట్లాడుతూ బ్యాంకు ఖాతాలు లేని వారికి గ్రామ సచివాలయాల్లో పోస్టల్ శాఖ ఖాతాలను తెరుస్తుందన్నారు. లబ్ధిదారులకు నేరుగా ప్రయోజనాలు చేరుతాయన్నారు. రూ.200 నగదు, మొబైల్ నంబరుతో పోస్టాఫీసులో ఖాతాలు తెరిచే అవకాశం ఉందన్నారు. ఈఓఆర్డీ కోటేశ్వరరావు, ఏఓ కొలుసు శివశంకర్ పాల్గొన్నారు.

విద్వేష పూరిత రాజకీయాలు సహించం

ఉయ్యూరు: విద్వేష పూరిత రాజకీయాలను సహించేది లేదని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రిలో చోటుచేసుకుంటున్న ఘటనలపై సోమవారం ఆయన మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న పెనమలూరులో ఘర్షణ పూరిత వైఖరికి పాల్పడుతూ టీడీపీ దిగజారుడు రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రిలో వైఎస్సార్ విగ్రహ ధ్వంసం ఘటనపై పోలీసులు ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వాస్పత్రిలో విగ్రహ ధ్వంసం, తొలగింపునకు ఘటనకు బాధ్యులుగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఆస్పత్రి చైర్మన్ మండవ జయదేవ్‌లేనని, వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి కేంద్రంగా జరుగుతున్న పరిణామాలను న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్తామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే రూ.4 కోట్లతో ఆస్పత్రి నిర్మాణం వసతులు కల్పించామని చెప్పారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

కంకిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు ఆధార్ ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 19, 20 తేదీల్లో కంకిపాడు -1 సచివాలయం, శ్రీచైతన్య జూనియర్ కాలేజ్, పునాదిపాడులో ఆధార్ ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. 21, 22 తేదీల్లో ఉప్పలూరు సచివాలయంలో, పునాదిపాడు జెడ్పీ పాఠశాలలోనూ ఆధార్ క్యాంపులు జరుగుతాయన్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

22న పార్సిల్స్ బహిరంగ వేలం

ఉయ్యూరు: విజయవాడ పార్సిల్ ఆఫీసులో అన్‌క్లెయిమ్డ్, అన్ ఐడెంటిఫైడ్ పార్సిల్స్ బహిరంగ వేలం ఈనెల 22వ తేదీన విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్(కమర్షియల్) ఎస్.మోషే తెలిపారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు పార్సిల్స్ బహిరంగ వేలం జరుగుతుందన్నారు. వేలంలో పాటదారులు పాల్గొనాలని కోరారు.

● శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు



దావాజిగూడెంలో శివలింగం ఆకారంలో దీపాలు వెలిగించిన భక్తులు

కార్తిక మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామివారికి దర్శించుకున్నారు. అనంతరం పూజలు నిర్వహించి, దీపాలు వెలిగించారు.

–రామవరప్పాడు/గన్నవరం/ఉయ్యూరు

సర్పంచ్ అవినీతిపై ఫిర్యాదు

విజయవాడరూరల్: అంబాపురం గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు గ్రామ సర్పంచి గండికోట సీతయ్య అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు నందిపాముల శ్యామల(ఉప సర్పంచి), తోడేటి కిరణ్‌కుమార్, అయిలా విజయ్‌కుమార్, మాజీ సర్పంచి తోడేటి విజయ్‌కుమార్, గ్రామస్తులు 11 అంశాలపై సర్పంచి అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు వినతి పత్రం అందజేశారు. తన కారు డ్రైవరు పేరును అనాధికారికంగా పంచాయతీ హాజరుపట్టీలో నమోదు చేసి పంచాయతీ నిధుల నుంచి జీతభత్యాలు చెల్లించారన్నారు. సర్పంచి అవినీతిపై ప్రత్యేక అధికారిని నియమించి విచారణ చేయించాలని వారు కోరారు.

ఓటరు ప్రత్యేక క్యాంపెయిన్‌ను సమర్థంగా నిర్వహించాలి

కంకిపాడు: ఓటర్ల నమోదు ప్రత్యేక క్యాంపెయిన్‌ను సమర్థంగా నిర్వహించాలని తహసీల్దార్ వి.భావనారాయణ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 23, 24 తేదీల్లో ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారన్నారు. సూపర్‌వైజర్లు, బీఎల్ఓలు ఆయా తేదీల్లో తమ తమ పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఓటర్ల జాబితాలో మృతులు వివరాలు తొలగించాలని, పేర్లు తప్పులు సవరించాలని సూచించారు. జాబితాలో ఫొటోలు సరిగా ఉన్నదీ? లేనిదీ పరిశీలించి జాబితాను సరిచేయాలన్నారు. 2025 జనవరి నాటికి 18 ఏళ్లు నిండిన ఓటర్లను చేర్పించటం, ఫారం 6, 7, 8 ఆన్‌లైన్ చేసి బీఎల్‌ఓలు రిపోర్టులను సమర్పించాలని సూచించారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు



గన్నవరంలో మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న విద్యార్థినులు



పెనమలూరులో విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న అధికారులు

కంకిపాడు/పెనమలూరు/ఉయ్యూరు/గన్నవరం/గన్నవరంరూరల్: పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో గ్రంథాలయ వారోత్సవాలు ఉత్సాహంగా.. ఉల్లాసంగా సాగుతున్నాయి. ఆయా గ్రంథాలయాల్లో సోమవారం విద్యార్థులకు లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముగింపు వేడుకల్లో బహుమతులు ప్రదానం చేయనున్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో గ్రంథాలయ అధికారులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

21న మెగా వైద్యశిబిరం

పెనమలూరు: పోరంకి శ్రీనివాసానగర్‌లో ఈ నెల 21వ తేదీన ఉచిత గుండె మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు పటమట పీవీఆర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఫౌండర్ వావిలాల రజినీకాంతశర్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం వివరాలు తెలుపుతూ పోరంకి శ్రీషిరిడీ సాయి సేవామందిరం ఆధ్వర్యంలో 21వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఉచిత శిబిరం నిర్వహిస్తామన్నారు. గుండె, నరాలు, మెదడు, ఎముకల, బీపీ, షుగర్ పరీక్షలతో పాటు గుండెకు ఎకో, ఈసీజీ పరీక్షలు చేస్తామన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

కంకిపాడు: మండలంలోని చలివేంద్రపాలెం గ్రామంలో అయ్యప్ప పడి పూజ మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. గురుస్వామి మరీదు శివశంకర్ 18వ పడి సందర్భంగా గ్రామంలో పడిపూజ నిర్వహించారు. గుంటుపల్లి శ్రీనివాసరావు గురుస్వామి, కోసూరు శ్రీనివాసరావు గురుస్వామి పడిపూజ జరిపించారు. గౌరీశంకర్‌స్వామి బృందం ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి. గురుస్వామి మరీదు శివశంకర్ కుటుంబ సభ్యులు అయ్యప్పకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి హాజరయ్యారు. అయ్యప్ప స్వామికి అభిషేకాలు, పూజలు చేయించారు. ప్రత్యేక పూజల్లో సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి అయ్యప్ప, భవానీ, శివ, ఇతర మాలధారులు అధిక సంఖ్యలో పూజలో పాల్గొని భిక్షను స్వీకరించారు.

డ్వాక్రా సభ్యుల నుంచి అదనపు చార్జీల వసూలుపై నిరసన

గన్నవరం: స్థానిక యూనియన్ బ్యాంక్‌లో డ్వాక్రా గ్రూపు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, అదనపు చార్జీలను నివారించాలని మండల సమాఖ్య నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ ఎదురుగా మహిళలు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దారును కలిసి వినతిపత్రం అందజేశారు. బ్యాంక్ వసూలు చేస్తున్న నగదు వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య మాజీ నాయకురాలు గొంది రాణి, సంఘ సభ్యులు డి.నళిని, టి.పల్లమ్మ, డి.కల్పన, సీహెచ్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి సెక్షన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా 100 అడుగుల రోడ్డు, నిడమానూరు రోడ్డు ప్రాంతంలో మంగళవారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. పొళ్ల బజారు, వికాస్ స్కూల్ రోడ్డు, నందమూరి ప్రసాదరావు రోడ్డు, సాయిబాబా ఆలయం ఏరియాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.